గణేశ్ లడ్డూ అధరహో..

మాదాపూర్ విలేజ్‌లో వినాయకుడి లడ్డూను రూ.13లక్షల 51వేలకు, స్వామివారి దగ్గర పెట్టిన కలిశం రూ.లక్షా 91వేలకు వేలం పాటలో కైవసం చేసుకున్న ఠాగూర్ నర్సింగ్ కుటుంబసభ్యులు

అల్లాపూర్ : అల్లాపూర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను రూ.3,90,116లకు, శ్రీఖనిల సమేత శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూను రూ.1,80,116లకు దక్కించుకున్న కునావత్ మోహన్



శేరిలింగంపల్లి : కొత్తగూడ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూను రికార్డు స్థాయిలో రూ.9.01లక్షలకు దక్కించుకున్న ఎంఆర్‌సీ జ్యూవెలర్స్ అధినేత మారోజు రాఘవేంద్ర

మాదాపూర్ : కొండాపూర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూను రూ.3.21లక్షలకు కైవసం చేసుకున్న స్థానికుడు రామ సుబ్బారెడ్డి

మాదాపూర్ : కొండాపూర్‌లోని న్యూ సైబర్ వ్యాలీలో గణపతి మండపం వద్ద నిర్వహించిన లడ్డూను రూ.2.116 లక్షలకు దక్కించుకున్న స్థానికుడు గోపాల్‌రెడ్డి

రంగధాముని చెరువులో జేసీబీ యంత్రంతో విగ్రహాల వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల లో | పారిశుధ్య పనులు, వ్యర్థాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి

33,743 విగ్రహాల నిమజ్జనం

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 18 : వినాయక నవరాత్రోత్సవాల్లో చివరి ఘట్టమైన నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలోని నాలుగు చెరువు వద్ద నిమజ్జన వేడుకలకు ఏర్పాట్లు చేయగా జీహెచ్‌ఎంసీతో పాటు పోలీసులు, రెవెన్యూ, జలమండలి, విద్యుత్, నీటిపారుదల, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా జీహెచ్‌ఎంసీ యంత్రాంగం అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ చెరువుల వద్ద చేసిన ఏర్పాట్లకు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, ఉత్సవాలను తిలకించడానికి వచ్చిన భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. మరోవైపు ట్రాఫిక్, పోలీసు అధికారులు నిమజ్జనాలు జరిగే చెరువుల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలతో వచ్చిన వాహనాలను మాత్రమే చెరువుగట్టుపైకి అనుమతులివ్వడంతో ఎలాంటి ట్రాఫిక్, శాంతిభద్రతల సమస్యలు తలెత్తలేవు. చెరువుగట్టుపై సీసీ కెమెరాల వ్యవస్థను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షణ చేయడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. ఆయా విభాగాల అధికారులందరి సమష్టి కృషి ఫలితంగా భక్తుల సహకారంతో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.

చెరువు గట్టుపై వ్యర్థాలను తొలగించే పనుల్లో పారిశుధ్య కార్మికులు

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల లో 33,743 విగ్రహాలు నిమజ్జనం

వినాయక నిమజ్జన ఏర్పాట్లకు కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల పరిధిలో నాలుగు ప్రధాన చెరువుల వద్ద ఏర్పాట్లు చేశారు. అత్యధికంగా విగ్రహాల నిమజ్జనాలు జరిగే రంగధాముని(ఐడీఎల్) చెరువుతోపాటు సున్నం చెరువు, హస్మత్‌పేట చెరువు, ప్రగతినగర్ చెరువులలో కలిపి 33,743 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు.

మట్టి వినాయక ప్రతిమలతో పర్యావరణానికి దోహదం

మియాపూర్/దుండిగల్, సెప్టెంబర్ 18 :పర్యావరణ హితంగా వినాయక నవరాత్రుల నిర్వహణలో నియోజకవర్గంలో భక్తులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు స్ఫూర్తిగా నిలిచారని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సింహభాగం మట్టి వినాయక ప్రతిమలను పూజించి అటు భక్తిని చాటుకుని ఇటు ప్రకృతికి ఎంతో దోహదం చేశారన్నారు. వివేకానందనగర్ డివిజన్ సుమిత్రనగర్‌లో వినాయక నవరాత్రి పూజలలో ఎమ్మెల్యే గాంధీ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేడుకల నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్ రోడ్ నంబర్ 7లో వినాయక నవరాత్రోత్సవాలు జరిగాయి. బీఆర్ఎస్ నేత నిమ్మల సంతోష్‌రావు ఆధ్వర్యంలో జయనగర్‌లో మండపం వద్ద కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సంతర్పణలో పాల్గొన్నారు. మట్టి వినాయక ప్రతిమల పూజలలో ప్రజలు, వేడుకల నిర్వాహకులు స్ఫూర్తిగా నిలిచారన్నారు.



సుమిత్రనగర్‌లో వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాకా శ్రీనివాస్‌రెడ్డి

అన్నదానం

దుండిగల్:నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 1వ డివిజన్ బాచుపల్లి క్రాంతినగర్ కాలనీలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమ దాత డాకా శ్రీనివాసరెడ్డి అన్నప్రసాద వితరణను ప్రారంభించారు.

మియాపూర్ : వినాయక పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవిరంగారావు

మాదాపూర్ : డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలోని గణనాథుడి మండపం వద్ద స్థానిక పార్టీ నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ : అన్న సమారాధనలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

అభివృద్ధిలో కాలనీల సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



దండముడి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,సెప్టెంబర్18 : కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలు పట్టుకొమ్మలని, ప్రతి ఒక్కరూ ఐక్యతతో ఉంటూ కాలనీలో సమస్యలను పరిష్కరించుకునేందుకు బాటలు వేసేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. బుధవారం జీడిమెట్ల డివిజన్ దండముడి ఎంక్లేవ్ నూతన అసోసియేషన్ కమిటీ నియామకమయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలువడంతో వారిని సన్మానించి, కాలనీ అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కాలనీ నూతన అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్, కోశాధికారి నాగరాజు పుప్పాల, ఇందిరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వినయ్‌మిశ్రా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ లెటర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 18: అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూకట్‌పల్లి డివిజన్ దయార్ గూడకు చెందిన బి.రమీలా కుటుంబ సభ్యులకు రూ.1.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనారోగ్యంతో వైద్యశాలలో చేరి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ ఉన్నారు.

తాగునీటి వసతి పెంపునకు నిధులివ్వండి

ఎండీని కోరిన పీఏసీ చైర్మన్ గాంధీ

మియాపూర్, సెప్టెంబర్ 18: జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తోపాటు పీఏసీ చైర్మన్ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ఐటీ ప్రాంతానికి వేదికగా ఉన్న నియోజకవర్గం నానాటికీ విస్తరిస్తున్నందున తాగునీటి వసతి పెంపు, డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి అదనపు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే చాలా ప్రాంతాలకు లైన్లను విస్తరించినప్పటికీ పెరుగుతున్న జనాభా దృష్ట్యా భవిష్యత్ అవసరాలకు సరిపోయేలా మరిన్ని లైన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉన్నదన్నారు. డ్రైనేజీ సమస్యలకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి గాను యూజీడీ నిర్మాణాలను మరింత విస్తరించాల్సి ఉన్నందున అదనపు నిధులను మంజూరు చేయడం ద్వారా ప్రజలకు మరింత సౌకర్యం కల్పించవచ్చని పీఏసీ చైర్మన్ గాంధీ కోరారు. తన వినతి పట్ల ఎండీ సానుకూలంగా స్పందించినట్లు గాంధీ తెలిపారు.

వెంకన్నహిల్స్ నాలా నిర్మాణంలో మార్పులు చేయాలి

జీడిమెట్ల డివిజన్ వెంకన్న హిల్స్ నాలా వద్ద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనుల్లో మార్పులు చేసి నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ బుధవారం వెంకన్నహిల్స్ ఫేస్-2, ఫస్ట్‌అవెన్యూ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. నిర్మాణం జరుగుతున్న కల్వర్టును ఎత్తుతోపాటు వెడల్పు చేసి నిర్మాణం చేపట్టాలన్నారు. దీంతో స్పందించిన డీసీ దీనిపై సంబంధిత ఇంజినీరింగ్ సెక్షన్ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, నాగేందర్‌రెడ్డి, సుబ్బారావు, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

– కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

'స్వచ్ఛత హీ సేవా-2024' కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు అధికారులు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణరావు ఆయా స్కూళ్లకు చెందిన విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించి, స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయం సమావేశ మందిరంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2తేదీ వరకు స్వచ్ఛత హీ సేవా-2024 జరగనున్న నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత వార్డు ఆఫీసర్స్‌పై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ ఎస్.సునంద, టౌన్‌ప్లానింగ్ అధికారి సంజన, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పి.సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్స్ రామచందర్, అంజయ్యతోపాటు ఆయా వార్డుల అధికారులు, శానిటేషన్ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

– దుండిగల్, సెప్టెంబర్ 18

కొండాపూర్‌లో నిమజ్జన వేడుకల్లో గలాట

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 18: కొండాపూర్‌లో వినాయక నిమజ్జనంలో ఇరువర్గాల యువకులు పరస్పరం దాడులు చోటు చేసుకున్న ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొండాపూర్ ప్రశాంత్‌నగర్ కాలనీలో జైగణేశ్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం రాత్రి వినాయక నిమజ్జనం నిర్వహించారు. స్నేహితుల ఆహ్వానం మేరకు బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన చందు, రమణదీప్‌లు కొండాపూర్ ప్రాంతానికి చేరుకున్నారు. నిమజ్జనం సందర్భంగా చిన్న విషయమై కొండాపూర్ ప్రశాంతినగర్ కాలనీకి చెందిన నీలం రవి, కిరణ్‌లతో వీరికి వాగ్వివాదం చోటుచేసుకున్నది.కాసేపటికి ఇరుగ్రూపులకు చెందిన యువకులు పరస్పరం కర్రలు, కుర్చీలతో దాడులు చేసుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ ఘటనలో పలువురుకి గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం, గంజాయి మత్తులో దాడులు చేసుకున్నారని, కత్తులతో దాడులు చేసుకున్నారనే ప్రచారంలో వాస్తవంలేదని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మియాపూర్, సెప్టెంబర్ 18 : ఆల్విన్ కాలనీ డివిజన్ జయనగర్‌లో రూ.16లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు, యూజీడీ పూర్తయిన చోట్ల యుద్ధ ప్రాతిపదికన సీసీ రోడ్డు నిర్మాణాలను చేపడుతున్నామని కార్పొరేటర్ పేర్కొన్నారు. ప్రజలకు అసౌకర్యం కలుగకుండా నిర్మించాలని సూచించారు. ఏఈ శ్రావణి, రవికుమార్, విష్ణు, వెంకటరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు. డివిజన్‌లోని ఆయా కాలనీలకు చెందిన నగేశ్, రాములు అనారోగ్యంతో మృతి చెందగా డీవీజీ ట్రస్టు ద్వారా అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయాన్ని యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ అందించారు.

ఆత్మహత్యలు చేసుకుంటున్న వీధి వ్యాపారులు

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర స్ట్రీట్ వెండర్ అధ్యక్షుడు సతీశ్ గౌడ్

మాదాపూర్, సెప్టెంబర్ 18: వీధి వ్యాపారుల మీద జరుగుతున్న ప్రభుత్వ అధికారుల దాడులతో వీధి వ్యాపారులు జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్ట్రీట్ వెండర్ అధ్యక్షులు సీహెచ్.సతీశ్ గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహించే ఉత్తరప్రదేశ్ వారనాసీలోని ప్రతాప్ ప్యాలెస్‌లో ఈనెల 13న నిర్వహించిన నేషనల్ స్ట్రీట్ వెండర్ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సతీశ్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారుల దాడులతో వీధి వ్యాపారులు జీవనోపాధి కోల్పోయి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కుటుంబ బాధ్యతల నడుమ అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో 21 రాష్ట్రాలకు చెందిన ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు హాజరయ్యారు.

నాలా బఫర్‌జోన్‌ను ఆక్రమించి..కాంపౌండ్‌వాల్ నిర్మాణం

జీడిమెట్ల డివిజన్ వెంకన్నహిల్స్‌కు వెళ్లేదారిలో నాలా బఫర్‌జోన్ ఆక్రమించి నిర్మించిన కాంపౌండ్‌వాల్

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18 : 132 జీడిమెట్ల డివిజన్ వెంకన్నహిల్స్‌కు నాలా నుంచి వెళ్లేదారి గుండా ఓ వ్యక్తి తన ఇంటికి మరో 30 గజాల నాలా బఫర్‌జోన్ స్థలాన్ని ఆక్రమించి కాంపౌండ్‌వాల్ నిర్మించాడు. వర్షాలకు వరద ప్రవాహంతో ప్రహరీ నిర్మాణం కూలిపోయింది. అయినా సదరు వ్యక్తి నాలా బఫర్‌జోన్ స్థలాన్ని వదిలివేయకుండా తిరిగి ప్రస్తుతం మూడవ సారి తాత్కాలిక ప్రహరీ బిల్లలను వేసి ఆక్రమించాడు. దీనిపై పలువురు ప్రశ్నించడంతో తన ఇంటి స్థలానికి ఆనుకొని నాలా బఫర్‌జోన్ స్థలం కూడా తనదే అంటూ దబాయిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. కాగా, కండ్లముందటే నాలా బఫర్‌జోన్‌ను పలుమార్లు ఆక్రమించి చేపట్టిన ప్రహరీ వరద తాకిడికి కూలిపోయినా సదరు వ్యక్తికి కనువిప్పు కాకపోవడం విశేషం. అదే ప్రాంతంలో నాలా కల్వర్టు నిర్మాణ పనులు సైతం జరుగుతున్నాయి. ఒకవేళ ఈ నిర్మాణం పూర్తి చేస్తే మిగిలిన బఫర్‌జోన్ స్థలం తనకే వర్తిస్తుందనే అత్యాశతో సదరు వ్యక్తి ఈ చర్యకు పాల్పడుతున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి, నాలా బఫర్‌జోన్ ఆక్రమణాన్ని వెంటనే కూల్చివేసి హద్దులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉచితవైద్య శిబిరం

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, ప్రగతినగర్ సమీపంలోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం(ఇన్‌కాయిస్)లో బుధవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో సంస్థ ఉద్యోగులతోపాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి బీపీ, షుగర్, ఈసీజీ వంటి పరీక్షలను నగరంలోని రెనోవో హాస్పిటల్ వైద్య సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ ఉద్యోగులు మురళీకృష్ణ, కిరణ్‌కుమార్, రోహిత్‌కుమార్, దాస రిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– దుండిగల్, సెప్టెంబర్ 18

నిజాంపేట్ మేయర్‌కు పరామర్శ

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజు పరామర్శించారు. కొలన్‌గోపాల్‌రెడ్డి మాతృమూర్తి కొలన్ కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్సీ బాచుపల్లి హిల్‌కౌంటీలోని మేయర్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయనతోపాటు నిజాంపేట్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్, కార్పొరేటర్లు బాలాజీనాయక్, గాజులసుజాత, నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయప్రసాద్ ఉన్నారు.

– దుండిగల్,సెప్టెంబర్ 18

అనుమానాస్పదస్థితిలో స్పాసెంటర్‌లో యువతి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 18:అనుమానాస్పదస్థితిలో స్పాసెంటర్‌లో పని చేస్తున్న ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జీడిమెట్ల పైపులైన్ రోడ్డులో శ్రీ స్మార్ట్ లుక్స్ బ్యూటీఅండ్ స్పా సెంటర్ ఉన్నది. వెస్ట్‌బెంగాల్‌కు చెందిన శాంతిదాస్ మహతో అలియాస్ సమీర(22)స్పాసెంటర్‌లో బ్యూటీషియన్‌గా పని చేసుకుంటూ తనతోపాటు మరో వర్కర్ గాయత్రితో ఇద్దరు కలిసి ఉంటున్నారు. ఈనెల 17న గణేశ్ నిమజ్జనం ఉండటంతో గాయత్రి తన బంధువుల ఇంటికి వెళ్లింది. కాగా, రూమ్‌లో సమీరా ఒక్కతే ఉన్నది. 18న గాయత్రి తిరిగి స్పాసెంటర్‌కు వచ్చి చూడగా లోపల గ్రిల్స్‌కు తాళం వేసిన సమీరాను ఎంత పిలిచినా పలుకపోవడంతో స్పాసెంటర్ యజమాని పార్వతికి సమాచారం ఇచ్చింది. దీంతో ఆమె ఘటనా స్థలానికి మరో తాళంచెవితో వచ్చి తెరిచి చూడగా లోపల సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్నది. వెంటనే పేట్ బషీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం స్పాసెంటర్ నిర్వాహకురాలు పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, సమీర ప్రేమ విషయంలో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని సమాచారం.

చిత్తారమ్మ బస్తీని వివాదాలకు లాగొద్దు

చిత్తారమ్మ డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్శనం శాఖయ్య

సమావేశంలో మాట్లాడుతున్న చిత్తారమ్మ ఇండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్శనం శాఖయ్య

బాలానగర్, సెప్టెంబర్ 18: బాలానగర్ చిత్తారమ్మబస్తీలో 50 ఏండ్లుగా ఎలాంటి కుల వివక్షకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో జీవిస్తున్న తమకు కొందరు వ్యక్తులు పార్టీల పేరుతో తమపై బురద జల్లడానికి ప్రయత్నాలు చేయడం తగదని చిత్తారమ్మ డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దర్శనం శాఖయ్య పేర్కొన్నారు. బుధవారం చిత్తారమ్మ డబుల్‌బెడ్‌రూం ఇండ్ల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. చిత్తారమ్మ డబుల్ ఇండ్ల సముదాయంలో చేపట్టిన ఆలయ నిర్మాణం పనులకు అసోసియేషన్ సభ్యులు అభ్యంతరం చెబుతున్నారని అసోసియేషన్‌పై సభ్యుడు ఆకుల నరేందర్ అనే వ్యక్తి తప్పుడు ఆరోపణలు చేయడం బాధాకరం అన్నారు. ఆలయ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. కొందరు సభ్యులతో నరేందర్ వ్యక్తిగత గొడవలకు పోయి ఆ విషయాన్ని అసోసియేషన్‌కు అంటగట్టడం సరికాదన్నారు. వ్యక్తిగత గొడవల కారణంగానే అతడిపై కొందరు సభ్యులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టినట్లు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ విషయంలో అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. చిత్తారమ్మ డబుల్ ఇండ్ల సముదాయం నిర్వహణ భారం కావడం వలన దానిని పూడ్చుకోవడం కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్ల ప్రాంగణంలో షెడ్ నిర్మాణం చేయించి దానిని అద్దెకు ఇచ్చి వచ్చిన సొమ్ముతో నిర్వహణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. షెడ్‌లో వ్యాపారం చేస్తున్న తాజ్ బేకర్స్ నిర్వహణపై అధికారులకు ఫిర్యాదు చేసి నరేందర్ అసోసియేషన్‌ను వివాదాలకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. అసోసియేషన్ ఎల్లప్పుడు సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. చిత్తారమ్మబస్తీలో కనీస సదుపాయాలు లేవని గుర్తించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇచ్చి పుణ్యం కట్టుకున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తిని ఈ వివాదంలోకి లాగరాదని హితవు పలికారు. ఆకుల నరేందర్ ఇప్పటికైనా తన వ్యవహార శైలిని మార్చుకొని అసోసియేషన్ సభ్యులతో కలిసి పని చేసేందుకు ముందుకు వస్తే తాము స్వాగతిస్తామని సూచించారు. కార్యక్రమంలో సామ్యేల్, జీ కృష్ణ, సత్యం, పి.వెంకట్, ఎం.కృష్ణలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

పార్కు స్థలాలు విక్రయించిన ఇద్దరిపై కేసు

దుండిగల్, సెప్టెంబర్ 18 : గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేట్ కేవీఆర్ లేఅవుట్‌లో పార్కుస్థలాలను విక్రయించిన ఇద్దరు వ్యక్తులపైనా దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. 2004-2005లో మల్లంపేట్‌లోని 54 ఎకరాలల్లో ఓ వ్యక్తి కేవీఆర్ పేరిట లేఅవుట్ చేశాడు. అయితే సదరు లేఅవుట్‌లో పది పార్కుల ఏర్పాటుకు ఖాళీస్థలాలను వదిలేశారు. ఈ క్రమంలో ఇక్కడ ఇండ్ల స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటంతో పార్కుస్థలాలపై కన్నేసిన స్థానికుడు నరేశ్, ఐడీఏ బొల్లారానికి చెందిన శివ అనే ఇద్దరు కలిసి వెంచ